క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరం



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని 15వ డివిజన్‌లోని మొగిలిచర్లలో వరంగల్‌కు చెందిన లలిత కిడ్నీ సెంటర్ ఆధ్వర్యంలో ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ బొట్టు మల్లేశ్వర్ తన తండ్రి కుమారస్వామి జ్ఞాపకార్థం శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. డాక్టర్ మల్లేశ్వర్‌ను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాలి

పర్వతగిరి : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలని స్థానిక ఎస్సై గుగులోతు వెంకన్న కోరారు. ఎన్నికల సందర్భంగా మీడియాతో శనివారం ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నారు. బంగారం, నగదు, ఇతర వస్తువుల తరలింపుపై ఆంక్షలుంటాయని చెప్పారు. రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్తే ఆధారాలు వెంట ఉంచుకోవాలని తెలిపారు. మండలంలోని చింతనెక్కొండ వద్ద పోలీస్ చెక్‌పోస్టు ఏర్పాటు చేశామన్నారు. సరైన పత్రాల్లేకుంటే డబ్బు, వస్తువులను సీజ్ చేస్తామని చెప్పారు. మద్యంపైనా ఎన్నికల కమిషన్ ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

పారిశుద్ధ్య కార్మికుల నిరసన



వర్ధన్నపేట : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులు శనివారం బైఠాయించి నిరసన తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వేతనాల కోసం మూడు నెలలుగా ఆందోళనలు చేస్తుండగా ఒక్క నెల వేతనం మాత్రమే ఇచ్చారని కార్మికులు వాపోయారు. కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చాలీచాలని జీతాలతో ఇబ్బంది పడుతున్న తమకు కనీసం సకాలంలో జీతాలివ్వకపోవడం సరికాదన్నారు. మున్సిపల్ పాలకవర్గం, కమిషనర్ చొరవ చూపాలని కోరారు.

రూ.1.50 లక్షల సాయం



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని రాజుపేట గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు కృష్ణ ఇటీవల క్యాన్సర్ బారిన పడి మృతి చెందగా బాధిత కుటుంబానికి తోటి ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు (2008-09, 2010-11 విద్యాసంవత్సరాల ఎస్సెస్సీ విద్యార్థులు) గ్రామ యువకులతో కలిసి సమీకరించిన రూ.1.50 లక్షల సాయం అందించారు. ఈ మేరకు కృష్ణ పిల్లల పేరిట పోస్టాఫీస్‌లో డబ్బులు డిపాజిట్ చేసి బాండ్లను శనివారం అందజేశారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత



రాయపర్తి : మండలంలోని పెర్కవేడుకు చెందిన మేకల యాదగిరి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి మాజీ సర్పంచ్ చిన్నాల తారశ్రీ రాజబాబు శనివారం 50 కేజీల బియ్యం సాయంగా అందజేశారు. తొలుత బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బాషబోయిన సుధాకర్, అమ్జద్‌పాషా, పుట్ట అశోక్, బందు రాజు, అరూరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా తరలిస్తున్న మహిళ అరెస్ట్

పర్వతగిరి : మండలంలోని మహబూబ్‌నాయక్‌తండాకు చెందిన బానోతు శ్రీలత గుడుంబా విక్రయించేందుకు వెళ్తుండగా మండల కేంద్రంలో శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై వెంకన్న తెలిపారు. ఆమె నుంచి 8 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

కేంద్ర బలగాలతో కవాతు

ఐనవోలు : మండల కేంద్రంలో శనివారం సివిల్ పోలీస్, సీఆర్‌పీఎఫ్ కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా పర్వతగిరి సీఐ శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో ఐనవోలు, సంగెం ఎస్సైలు అనిల్ కుమార్, నరేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట : నివాళులర్పిస్తున్న నాయకులు



నర్సంపేట రూరల్ : మాదన్నపేటలో..



గీసుకొండ : మనుగొండలో..



విప్లవ వీరుల స్ఫూర్తితో పోరాడాలి

● భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి

నర్సంపేట : దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన విప్లవ వీరుల స్ఫూర్తితో పాలకుల తప్పుడు విధానాలపై ప్రజలు పోరాడాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి వంగల రాగసుధ, అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమైక్య జిల్లా కార్యదర్శి జన్ను రమేశ్ కోరారు. పట్టణంలోని మార్క్స్ కాలనీలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి రాగసుధ, రమేశ్ పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీడబ్ల్యూ జిల్లా కమిటీ సభ్యురాలు జన్ను జమున, ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కమిటీ సభ్యురాలు బిందు తదితరులు పాల్గొన్నారు.

మాదన్నపేటలో..

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మాదన్నపేటలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల చిత్రపటాలకు ఎంసీపీఐ(యూ) నాయకులు నివాళులర్పించారు. అనంతరం ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొత్తకొండ రాజమౌళి మాట్లాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కేశెట్టి సదానందం, గ్రామ కమిటీ కార్యదర్శి అనుమాల రమేశ్, నాయకులు కందికొండ సాంబయ్య, గుర్రం రవి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్పీ ఆధ్వర్యంలో..

పర్వతగిరి : మండల కేంద్రంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు రెవెల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్‌ఎస్పీ) ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్ మాట్లాడారు. రైతు సంఘం జిల్లా కన్వీనర్ ఎన్నమనేని వెంకటేశ్వర్‌రావు, గీత కార్మిక సంక్షేమ సంఘం మండల కన్వీనర్ దొమ్మటి వీరస్వామి, శేషనాథ్ పాల్గొన్నారు.



పర్వతగిరిలో..

మనుగొండలో..

గీసుకొండ : భగత్‌సింగ్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు బాలకిశోర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆకుల రుద్ర ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్ము పవన్, నాయకులు రాము, రాజారామ్, తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌నగర్‌లో..

ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్‌లో స్వాతంత్య్ర సమరయోధుల వర్ధంతి నిర్వహించగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు మాట్లాడారు. బీజేపీ మతోన్మాద ఆలోచనలను తిప్పికొట్టాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఈసంపెల్లి బాబు, నాయకులు ముంజాల సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

భగత్ యూత్ ఆధ్వర్యంలో..

మండలంలోని ధర్మరావుపేటలో భగత్ యూత్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. యూత్ అధ్యక్షుడు కోరె సుధాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో బాధ్యులు రమేశ్, వెంకటేశ్వర్‌రావు, దేవేందర్ రావు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



దుగ్గొండిలో..

బొబ్బరోనిపల్లిలో..

దుగ్గొండి : మండలంలోని బొబ్బరోనిపల్లి గ్రామంలో భగత్‌సింగ్ చిత్రపటానికి ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ సభ్యుడు ఎల్లబోయిన రాజు పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, వివేక్, శివ తదితరులు పాల్గొన్నారు.

జాగృతి స్కూల్‌లో..

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని జాగృతి స్కూల్‌లో భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం స్కూల్ కరస్పాండెంట్, ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి జన్ను రమేశ్ మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోదాదేవి, ఉపాధ్యాయులు శిరీష, కవిత, సరస్వతి పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

నెక్కొండ : మండల కేంద్రంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు సీపీఐ మండల కార్యదర్శి కందిక చెన్నకేశవులు పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు చిలుకలపల్లి శ్రీనివాస్, నీరటి సుగుణమ్మ, అఫ్జల్, పిట్టల బుచ్చమ్మ, బాగతి భిక్షపతి, మాడుగుల చంద్రమ్మ, పొనకంటి కనుకమ్మ, భూపెల్లి కనకమ్మ, తదితరులు పాల్గొన్నారు.



ఖానాపురంలో..



చెన్నారావుపేటలో..



నెక్కొండలో..

అవగాహనే ‘ఎర్త్ అవర్’ లక్ష్యం

నర్సంపేట : పర్యావరణ సమస్యలు, ప్రమాదాలు, విద్యుత్ ఆదా ప్రాముఖ్యత, తదితరాలపై ప్రజలందరికీ అవగాహన కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఏటా ఎర్త్ అవర్ కార్యక్రమం నిర్వహిస్తోందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ తెలిపారు. పట్టణంలోని ఆ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఎర్త్ అవర్ సందర్భంగా సుమారు గంటపాటు విద్యుత్ పరికరాలు ఉపయోగించకూడదని తెలిపారు. వృక్షశాస్త్ర విభాగాధిపతి ఎం.నరేందర్ మాట్లాడుతూ 2007 మార్చి 31న తొలిసారిగా సిడ్నీలో ఎర్త్ అవర్ పాటించారని చెప్పారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంలోని అందరిపైనా ఉందన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నవీన్

కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనాథ్, అధ్యాపకులు టి.రమేశ్, ఎల్.సత్యనారాయణ, డాక్టర్ బి.విష్ణుకుమార్, డాక్టర్ ఐ.శివ నాగ శ్రీను, ఎం.సమ్మయ్య, డాక్టర్ జె.లకన్‌సింగ్, డాక్టర్ బి.రమేశ్, డాక్టర్ జి.ప్రసూన, డాక్టర్ టి.సుమతి, పి.త్యాగయ్య తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారమే ధ్యేయం



శిక్షణ ఇస్తున్న ఉద్యోగి

చెన్నారావుపేట : గ్రామాల్లో నీటి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేయాలని మిషన్ భగీరథ గ్రిడ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) ప్రదీప్, ఎంపీడీఓ గోవిందరావు ఆకాంక్షించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామాల్లో నీటి సమస్యను గుర్తించి వెంటనే పరిష్కరించాలని చెప్పారు. నెలకు మూడు సార్లు వేర్వేరు ప్రదేశాల్లో నీటి పరీక్షలు చేయాలని తెలిపారు. వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలని, ప్రజలకు తాగునీటి సమస్య ఎదురవకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రజలకు సురక్షితమైన నీటిని అందించడానికి చొరవ చూపాలని తెలిపారు. అనంతరం నీటిని పరీక్ష చేసే విధానంపై కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. సమావేశంలో డీఈ మంగీలాల్ నాయక్, ఎంఈఓ శ్రీధర్‌రాజు, అశోక్ పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే సంఘాల ప్రగతి

దుగ్గొండి : పాలకవర్గాలు, సభ్యులు సమష్టిగా కృషి చేస్తేనే సహకార సంఘాలు ప్రగతి పథంలో పయనిస్తాయని సహకార వికాస సంస్థ అధ్యక్షురాలు కాసర్ల జయప్రదం స్పష్టం చేశారు. మండల కేంద్రంలో అధ్యక్షుడు మహ్మద్ ఉస్మాన్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన దుగ్గొండి పురుషుల పొదుపు సంఘాల సమితి వార్షిక మహాసభకు ఆమె అతిథిగా హాజరై మాట్లాడారు. సమితిలో 4,348 మంది సభ్యులు ఉండగా రూ.8.81 కోటడబ్బు నిల్వ ఉండడం అభినందనీయమని తెలిపారు. సంఘాలన్నంటినీ త్వరలోనే కంప్యూటరీకరిస్తామని చెప్పారు. సంఘాల సేవలను సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు ధర్మావతి, నవీన్, రవీందర్, చంద్రయ్యపల్లి, కమ్మపల్లి, దుగ్గొండి, నేరేడుపల్లి, రేబల్లె వసంతాపురం, వెంకటాపురం, ప్రగతి సింగారం, దేశాయిపల్లి, అక్కంపేట సంఘాల బాధ్యులు కందుల శ్రీనివాస్, గంగిడి రాజిరెడ్డి, పోలోజు లింగమూర్తి, సత్యనారాయణరెడ్డి, మహేందర్, నర్సయ్య, రమేశ్, బాపురావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జయప్రద

మహిళల స్వయం ఉపాధికి ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న వేలూరి వనజ

● లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు వనజ

సంగెం : మహిళల స్వయం ఉపాధికి ప్రాధాన్యమిస్తున్నట్లు హనుమకొండ కనకదుర్గ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు వేలూరి వనజ తెలిపారు. మండలంలోని గవిచర్లలోని స్వజన వృద్ధాశ్రమంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వనజ అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. గ్రామాన్ని దత్తత తీసుకుని గ్రామీణ కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. మహిళలకు జీవనోపాధి కల్పించేలా కుట్టు శిక్షణా కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. మహిళలు కుట్టు శిక్షణ, ఇతరత్రా కార్యక్రమాలు వినియోగించుకుని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావాలని సూచించారు. మహిళలకు క్లబ్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గూడ సంపత్‌రెడ్డి, వేలూరి శారద, లక్ష్మీనర్సింహారావు, వేలూరి శ్రీదేవి, శ్యామల, శార్వాణి, శశికళ, మాజీ ఎంపీపీ దొనికెల మల్లయ్య, మాజీ సర్పంచ్ దొనికెల రమ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బీజేపీని బలోపేతం చేయండి

● చేరికల కమిటీ కన్వీనర్ రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట రూరల్ : గ్రామస్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ నర్సంపేట నియోజకవర్గ చేరికల కమిటీ కన్వీనర్ రాణాప్రతాప్‌రెడ్డి శ్రేణులకు సూచించారు. మండలంలోని ఇటుకాలపల్లిలో మాజీ వార్డు సభ్యుడు తాళ్లపల్లి రాము ఆధ్వర్యంలో గర్వందుల రవి, బర్ల సాయిలు, సోనబోయిన చేరాలు, ప్రేమ్‌కుమార్, తదితరులు ఆ పార్టీలో శనివారం చేరగా వారికి రాణాప్రతాప్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ బడుగు, బలహీనవర్గాలకు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తూ గ్రామాల్లో మరింత బలోపేతం చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అన్ని గ్రామాలకు చేరాయని చెప్పారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే, ప్రజలకు మరింత సుపరిపాలన అందాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్న సీతారాంనాయక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గంగిడి మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కేశబోయిన నరేశ్, ప్రధాన కార్యదర్శి తడుక వినయ్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు అచ్చ దయాకర్ పాల్గొన్నారు.



బీజేపీలో చేరిన వారికి కండువా కప్పుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

ఆర్‌ఎంపీ సంపత్ సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న మహేందర్, నాయకులు

● ఏబీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్

సంగెం : పేదల వైద్యుడిగా ఆర్‌ఎంపీ పొడేటి సంపత్ అందించిన సేవలు మరవలేనివని హైకోర్టు న్యాయవాది, ఏబీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కలకోట మహేందర్ తెలిపారు. మండలంలోని పల్లారుగూడలో సంపత్ కుటుంబాన్ని శనివారం ఆయన పరామర్శించారు. తొలుత సంపత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహేందర్ మాట్లాడారు. ఆర్‌ఎంపీగా సంపత్ పేదలకు ఎనలేని సేవలు అందించారని చెప్పారు. సంపత్ కుమారుడు ప్రశాంత్ సామాజిక ఉద్యమకారుడిగా ప్రజాసేవ చేస్తుండడం అభినందనీయమని తెలిపారు. సంపత్ మృతి బాధాకరమన్నారు. పేదలకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేశ్, కలకోటి సత్య తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వేలం వాయిదా

నెక్కొండ : స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని వారాంతపు సంత (అంగడి వేలం) రెండోసారీ వాయిదా పడింది. ఈ మేరకు ఇన్‌చార్జ్ ఎంపీఓ సునీల్ కుమార్, ఈఓ సదానందం ప్రకటించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో 2024-25 సంవత్సరానికి మేకలు, గొర్రెలు, తైబజార్ (గంపచిట్టి)కి ప్రత్యేకాధికారి, తహసీల్దార్ అధ్యక్షతన శనివారం వేలం నిర్వహించగా మేకలు, గొర్రెలకు గతంలో రూ.36 లక్షలు ఉండగా గుత్తేదారులు రూ.15.80 లక్షలు, తైబజార్‌కు రూ.7 లక్షలు ఉండగా రూ.1.90 లక్షలు మాత్రమే పాడారు. దీంతో ప్రభుత్వ అప్‌సెట్ ప్రైజ్ తక్కువ నమోదు కావడంతో ప్రభుత్వ నిబంధనల మేరకు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని వివరించారు.



వేలం నిర్వహిస్తున్న ఈఓ సదానందం

పాఠశాలల్లో ముందస్తు హోలీ వేడుకలు



నర్సంపేట రూరల్ : బిట్స్ టెక్నో స్కూల్‌లో హోలీ వేడుకలు నిర్వహిస్తున్న విద్యార్థులు



నర్సంపేట : అక్షర ద స్కూల్‌లో..



సంగెం : సిద్దార్థ స్కూల్‌లో..

నర్సంపేట : పట్టణంలోని మాంటిస్సోరి స్కూల్‌లో శనివారం ముందస్తు హోలీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. హోళీ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. రంగులు ఆనందానికి నిదర్శనమని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఎర్ర ఊర్మిళదేవి, ప్రిన్సిపాల్ కడియం శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ ఆకాశ్, తదితరులు పాల్గొన్నారు.

అక్షర ద స్కూల్‌లో..

అక్షర ద స్కూల్‌లో హోలీ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు రంగులు చల్లుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలాజీ టెక్నో స్కూల్‌లో..

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారులోని బాలాజీ టెక్నో స్కూల్‌లో హోలీ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు రంగులు చల్లుకుంటూ సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంగెం : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తు హోలీ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు రంగులు చల్లుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

ఖానాపురం : మండలంలోని బుధరావుపేటకు చెందిన పశువుల కాపరి యాపశెట్టి నాగులు (25) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. ఆయన శుక్రవారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పశువుల యజమాని శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

‘వ్యాక్సిన్ వికటించి గేదె మృతి’

వర్ధన్నపేట : మండలంలోని కొత్తపల్లిలో గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేసిన గంటలోనే గేదె మృతి చెందింది. వ్యాక్సిన్ వికటించి గేదె మృతి చెందిందని రైతు యాకయ్యతోపాటు స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని గొడవకు దిగారు. కాగా, పశుసంవర్ధక శాఖ వరంగల్ అధికారి జాయింట్ డైరెక్టర్ (జేడీ) బాలకృష్ణ, వర్ధన్నపేట అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) యాకూబ్‌రెడ్డి, దమ్మన్నపేట వీడీ రాజేందర్ ఆధ్వర్యంలో గేదెకు శవ పరీక్ష నిర్వహించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



వర్ధన్నపేట : ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను శనివారం పట్టుకున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని ల్యాబర్తి శివారు ఆకేరు వాగు నుంచి ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహన యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నారావుపేట : నేడు (ఆదివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈఈ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు 33 కేవీ లింగగిరి ఫీడర్ లైన్ మెయింటెనెన్స్ పనులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. లింగగిరి 33/11 కేవీ, 33/11 కేవీ పాపయ్యపేట ఉపకేంద్రాల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని వివరించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s. Shriram Finance Limited, WARDHANNAPET Branch, I issue the following notice to general public. My Client intends to grant loan to KOTAMARTHI ANITHA, W/o. Ashok, Resident of H.No. 3-25/1, Manchuppula Vill, Palakurthy Mandal, Jangaon Dist. Telangana by keeping the below mentioned property as security by way of Registered Mortgage. As such if any one have any claims charges, Mortgages, Sale Agreements, Court Attachments, Court Disputes etc., shall be informed to the address mentioned below in writing within 5 days from the date of the notice. Otherwise, later objections will not bind my client in the regard.

Sd/- NALLELLA SURENDER, B.A. LL.B
Advocate
Flat No. 301, H.No. 1-8-489, Haritha Residency, Bala Samudram, HNK. Dist. Wgl. TS. Cell: 9849365117

PUBLIC NOTICE

Under the instructions of my client M/s. Shriram Finance Limited, WARDHANNAPET Branch, I issue the following notice to general public. My Client intends to grant loan to SIRRU RAJAIAH, S/O. Yakaiah, Resident of H.No. 3-74, Nallabelli, Wardhannapet Mandal, Warangal Dist. Telangana by keeping the below mentioned property as security by way of Registered Mortgage. As such if any one have any claims charges, Mortgages, Sale Agreements, Court Attachments, Court Disputes etc., shall be informed to the address mentioned below in writing within 5 days from the date of the notice. Otherwise, later objections will not bind my client in the regard.

Shedule of the Property : The R.C.C. & A.C.C. Roof Building with open place property bearing G.P. H.No. 3-74, admeasuring to an extent of 203.88 Square yards equivalent to 170.47 Square Meters, with R.C.C. Plinth area 382.15 Square Feet's & A.C.C. Plinth area 306.00 Square Feet's, Situated at Nallabelly Village & Grama Panchayath, Wardhannapet Mandal, Warangal Rural District, with in the limits of Grampanchayath Nallabelly, within the Revenue and Registration District Warangal and it is in the Jurisdiction of Sub-Registrar, Wardhannapet and bounded by the following Boundaries : East: 10-00 Wide Road, West: Open Plot of D. Karukamma, North: Open Plot of D. Prabhakar, South: House of B. Ganesh

Sd/- NALLELLA SURENDER, B.A. LL.B
Advocate
Flat No. 301, H.No. 1-8-489, Haritha Residency, Bala Samudram, HNK. Dist. Wgl. TS. Cell: 9849365117

పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సత్యవతి

రాయపర్తి : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని బాలింతలు, గర్భిణులు, చిన్నపిల్లలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతి కోరారు. ‘పోషణ పక్వాడ్’లో భాగంగా మండలంలోని తెట్టెకుంటతండాలోని అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏఎన్‌ఎం రజియా ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సత్యవతి మాట్లాడారు. ప్రభుత్వం చిన్నపిల్లల్లో పోషకాహార లోపం నివారించేలా పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుజాత, ఆశావర్కర్ మమత, హెల్పర్ కవిత, తదితరులు పాల్గొన్నారు.